కథ

# లక్కీ సిటీ పార్లర్

ఎండీ అబ్దుల్లా
80080 18871

నగరానికి ఒకవైపు సబ్‌అర్బన్‌గా.. మరోవైపు పంట పొలాలు ప్లాట్లుగా మార్చుకుంటున్న గ్రామం అది! మూతి గుడ్డలు ఇంకా తొలగకున్నా.. 'అన్‌లాక్' మొదలైంది. జాతీయ రహదారికి ఆనుకొని కార్పొరేట్ కళాశాలలు, కొత్తకొత్త రియల్ ఎస్టేట్ వెంచర్లు పరుచుకుంటున్న ప్రాంతం కావడంతో.. ఆ జంక్షన్‌లో లైన్ బస్సులు, సిటీ బస్సుల ప్రవాహం ఉదయం నుంచి రాత్రి వరకూ ఉంటూనే ఉంటుంది.

'లక్కీ సిటీ పార్లర్'.. ఆ ప్రాంతంలో పేరున్న రోడ్‌సైడ్ 'పాకవిలాస్'. పార్లర్‌లో చిన్నపాటి టేబుళ్లవద్ద రోజూ సిటీకి 'అప్ అండ్ డౌన్' చేసే ప్రయాణికుల మాటల మూటల గందరగోళం. ఎఫ్‌ఎం రేడియో నుంచి 'పాట కావాలా' కార్యక్రమం. మధ్యలో వార్తా విశేషాలు.

''మనూర్లు కూడా సిటీలో కలిసిపోతాయేమో?!'' భయం – ఆశ – చిరాకు.. ముఖంమీద కనిపించకుండా అన్నాడు ముఖలింగం.

''ఏటీ!? మళ్లీ సిటీకెళ్లి ఎనకేసేద్దామనే!?''.. అనుమానంతో కూడిన జోక్ వేశాడు భాస్కర్.

''మనం ఈ ఊరొదిలి ఇక సిటీకి మాత్రం వెళ్లొద్దని మాట అనుకున్నాం కదా!?'' అన్నాడు ఉమ.

''మరి.. మల్లి మాత్రం మనని తరిమేసిన ఆ మహానగరానికి వెళ్లేందుకే నిర్ణయించుకున్నాడు కదా!?'' అన్నాడు ముఖలింగం.

గడిచిన ఆరునెల్లుగా ఆ నలుగురూ మధ్యాహ్నం నుంచి రాత్రి పార్లర్ మూసేవరకూ, ఆ మూల టేబుల్ తమ సొంతం అన్నట్టు గడిపేస్తూ.. గంటకో టీ తాగుతున్నారు! పక్కనున్న బియ్యాలపేటవాసి ముఖలింగం.. మహానగరంలో కార్పెంటర్ పనిచేసేవాడు. అయినాడ వాస్తవ్యుడు భాస్కర్.. నగరంలో రాడ్ బెండర్‌గా ఉపాధి పొందేవాడు. ఉమ.. దాకమర్రి కుర్రాడు. సిటీలో సిమెంట్ మిక్సర్ ఆపరేటర్‌గా ఉండేవాడు. మల్లిది జామి గ్రామం. నగరంలో టైల్స్ వేసే పనిచేసేవాడు.

వలసల పరుగులో తిరిగొచ్చే వరకూ అందరూ ఒకే మహానగరంలో ఉపాధి పొందారని వారికే తెలియదు. వందల మైళ్ల ఆవల నగరంలో తాము బతికిన బతుకు ఇకపై పనికొచ్చేదో కాదో వాళ్లకు ఇంకా సందేహమే! ఆ గ్రామానికి తిరిగివచ్చిన నాటినుంచి ఎవరు ఎదురైనా.. 'ఏటి సేస్తన్నవు?' అని అడుగుతారేమో అన్న అవమానంలాంటి భయం. పక్కనున్న నగరంలో తాము చేసే పనులు దొరకవు. అక్కడ కుదురుకున్నవాళ్లే కొంతమంది గ్రామాలకు తిరిగొచ్చారని వింటున్నారు. సిటీ నుంచి తిరిగి రావడం జీవితంలో ఆ నలుగురూ మరచిపోలేరు.. తల్చుకోవడమే భయం!

గ్రామాల్లో పనుల్లేక.. ఏం చేయాలో తెలియక అలా మధ్యాహ్నానికి పార్లర్ దగ్గరికి రావడం అలవాటు చేసుకున్నారు. అలా పనిలేకుండా పోవడమే వారిమధ్య ఒక రకమైన స్నేహాన్ని పెంచింది. ఏ చిన్న వ్యాపారం చేద్దామన్నా మదుపులు కూడా లేవు. ఒకప్పుడు ఏడాదికి రెండుసార్లు ఇంటికొస్తే గడపలో పండగే! చిన్నా చితకా అప్పులు తీర్చి, తల్లిదండ్రులకు పండుగలకు బట్టలు కుట్టించడం దగ్గర నుంచి.. టీవీ, సెల్‌ఫోన్లు కొన్నారు. ''సెలవలకు వచ్చావేట్రా!?'' అంటూ గ్రామంలో అందరి నోటా కుశలం! గడిచిన మార్చి నెల అంటే ఆ నలుగురిలో భయం, కోపం!

పరిచయాలైన కొత్తలో ముఖలింగం, భాస్కర్.. ఆనాటి సంగతులు పంచుకున్నారు. కన్నీళ్లు రాకుండా ఏడుస్తూ, పరుగులు పెట్టిన ఆ రాత్రి – పగళ్లను దాటిన జీవితాన్ని ఒకరికొకరు పూసగుచ్చుకున్నారు. ఉమ, మల్లి.. అలాంటి అనుభవాల్నే గుర్తుతెచ్చుకున్నారు. 'ప్రయోజకులు' అనే బిరుదులాంటి పొగడ్తలతో తలెత్తుకు తిరిగే ఆ నలుగురూ.. ఇప్పుడు జవాబు చెప్పలేని అసహనంతో సిటీ పక్కనున్న ఆ గ్రామంలో ఏదైనా పని దొరుకుతుందేమోననే ఆశతో గడుపుతున్నారు. అందుకే.. పొద్దుపోయే వరకూ ఆ పార్లర్‌లోనే గడిపేస్తున్నారు.

* * *

ముఖలింగం, భాస్కర్, ఉమ.. ముగ్గురూ తమ గత జీవితాల జ్ఞాపకాల్లో మునిగిపోయారు.

మల్లి మాత్రం పార్లర్ ఓనర్ టేబుల్ మీదున్న ఎఫ్‌ఎం రేడియోలో వార్తలు వింటున్నాడు. వివిధ నగరాల మధ్య ప్రయాణికుల వాహనాలు తిరుగుతున్నాయనీ, ఏ నగరంలో ఎంతమంది మహమ్మారి బారిన పడి కన్నుమూసేరో లెక్కలు చెబుతున్నాయి ఆ వార్తలు. పార్లర్ బయటికెళ్లి, సిగరెట్ వెలిగించి.. హైవేలో వెళ్తున్న బస్‌వైపు చూశాడు మల్లి.

''ఏంటి గురూ! సడెన్‌గా బయటికి వచ్చావు?'' అడిగారు ముఖలింగం, ఉమ, భాస్కర్.

''ఇంట్లో టీవీ అమ్మేస్తే ఎంతొస్తుంది'' అడిగాడు మల్లి.

''ఎందుకూ!?'' అన్నారు ముగ్గురు.

''రేపు సిటీకి బయల్దేరు తాను!''.

''ఆ అమ్మాయి దొరుకుతుందనే!? ఆళ్ల సొంతూరోళ్లు, బంధువులే చేతులెత్తేశారు. ఆమె నీకెలా కానొస్తుంది!?'' అని అడిగాడు భాస్కర్.

''దొరికే వరకూ వెదుకుతాను. లారీ గ్యారేజ్ ఆయన టీవీ కొంటానన్నాడు. అడగనా!?'' అన్నాడు మల్లి.

ఆ రాత్రే గ్యారేజ్‌కు టీవీని తీసుకొచ్చి.. 15వేల టీవీని 5వేలకు అమ్మేశాడు. మిగిలిన ముగ్గురూ ఎవరెవరినో అడిగి మరో రెండువేలు ఇచ్చారు. ఉదయం బస్ ఎక్కి పక్కనున్న సిటీలో రైల్వేస్టేషన్‌కు చేరుకొని.. రైలెక్కాడు.

జనరల్ బోగీలో.. మూతి గుడ్డలతో దూర దూరంగా ఎవరెవరో! సిటీ శివార్లు దాటి హైవే పక్కగా రైలు వెళ్తున్నది. చినుకులతో మొదలై వర్షం కురుస్తున్నది. కిటికీ పక్కన కూర్చున్న తన కంట్లో తుంపర్లు!

* * *

లాక్‌డౌన్ వారం గడిచాక.. ఆకలికి జడిసి నగరం నుంచి బయల్దేరాడు మల్లి. 'వెళ్లాలా? వద్దా?' అనే ఆలోచనలతో ఆలస్యమై.. అర్ధరాత్రి దాటిపోయింది. కాలనీ దాటి మార్కెట్ సెంటర్‌కు వస్తుంటే.. కొంతదూరంలో బారికేడ్ల వద్ద వ్యాన్లు నిలిపి పోలీసుల గుంపులు. పదేళ్లు ఇదే ఏరియాలో కాలరెగరేసి తిరిగాడు. కానీ, ఇప్పుడు మార్కెట్ సందుల్లోంచి జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. పోలీస్ వ్యాన్ వస్తున్నట్లు సైరన్ వినిపించడంతో.. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనున్న రేకులషెడ్లో నక్కి కూర్చున్నాడు. వ్యాన్ దాటిపోయిన కొంతసేపటికి లేచి నిలబడి.. అటూఇటూ చూశాడు. ఆ రేకులకు అటువైపు నుంచి ఏదో కదిలినట్టు అనిపించింది. వెలుగుతూ ఆరుతున్న స్ట్రీట్‌లైట్ వెలుగులో ఒక అమ్మాయి ఆకారం. నోటికి వేలు అడ్డం పెట్టి 'మాట్లాడకు!'

